ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

బుధవారం 11 సెప్టెంబరు 2024

నవోయద ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 10: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహార్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. **వెబ్‌సైట్ :cbseitms.rcil.gov.in**

పంట దెబ్బతిన్న రైతులకు న్యాయం చేస్తాం

- వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం
- మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యేలు తదితరులు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన భారీవర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు న్యాయం చేస్తామని మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, తదితర ఆస్తుల నష్టాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల వల్ల 86 గ్రామాల్లో పంటలు, ఇళ్లు, ఇతర ఆస్తులకు నష్టం జరిగిందని, రైతులందరికీ నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 9,958 హెక్టార్లలో 42 కోట్ల రూపాయల విలువైన పంట నష్టం జరిగిందని అన్నారు. 25 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. 230 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని అన్నారు. కలెక్టర్ రాజకుమారి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాలో జరిగిన వరద నష్టాన్ని మంత్రులకు వివరించారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ సిద్ధాపురం చెరువు బండ్ దెబ్బతినే ప్రమాదం వుందని, ఇరిగేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతే సేవ గోడ పత్రికను మంత్రులు, కలెక్టర్ ఆవిష్కరించారు.

నేడు వినాయక నిమజ్జనం

నంద్యాలలో చిన్న చెరువు కట్ట వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు



చిన్న చెరువు కట్ట వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లు

నంద్యాల కల్చరల్/నంద్యాల క్రైం, సెప్టెంబరు 10: నంద్యాల పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు ఈనెల 7 వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వాడవాడలా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం జరిగే వినాయక నిమజ్జన కార్యక్రమానికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆధ్వర్యంలో గణేష్ కేంద్రసమితి సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గాంధీ చౌక్‌లో గణేష్ కేంద్ర సమితి ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాల స్వాగత సభను ఏర్పాటు చేస్తున్నట్లు సమితి సభ్యులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు ముఖ్య అతిథులు, ప్రభుత్వ అధికారులు, గణేష్ కేంద్ర సమితి సభ్యుల ఆధ్వర్యంలో మొదటి విగ్రహాన్ని నిమజ్జనం చేసి ప్రారంభించనున్నారు. నిమజ్జనానికి తరలివచ్చే వినాయక విగ్రహాలకు ఎలాంటి ఆటంకం లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. చిన్న చెరువు కట్ట సమీపంలో ఎలాంటి అపశృతి చోటు చేసుకోకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో చిన్నచెరువుకట్ట వద్ద తాత్కాలిక రోడ్లు, 4+1 క్రేన్లు ఏర్పాటు చేస్తున్నట్లు గణేష్ కేంద్ర సమితి సభ్యులు తెలిపారు.

శోభాయాత్ర ఇలా...

నంద్యాల పట్టణంలోని చిన్న చెరువు కట్ట వరకు జరిగే వినాయక నిమజ్జన శోభాయాత్రపై ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆరా తీశారు. సిబ్బందితో కలిసి వినాయక ఘాట్‌తోపాటు కుందూనది పరిసర ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. శ్రీనివాససెంటర్, బైర్మల్‌వీధి, విక్టోరియా రీడింగ్ రూమ్, గాంధీ చౌక్, జామియా మస్జిద్, ఆత్మకూరు బస్టాండ్ మీదుగా వెళ్లే వినాయక విగ్రహాల ఊరేగింపు ప్రాంతాలను కూడా ఆయన పరిశీలించారు. వినాయక ఘాట్ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే భారీ క్రేన్లను, వాటికి సంబంధించిన డ్రైవర్లను, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలని పోలీస్, ఇతర శాఖల సిబ్బందికి సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 527 వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేయనున్నారన్నారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జె.వి. సంతోష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఏరిషావలి, ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త, గణేష్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

శ్రీశైలం ఆరు గేట్ల ఎత్తివేత

- జలాశయానికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



శ్రీశైలం జలాశయం నుంచి దిగువకు వెళ్తున్న వరద

శ్రీశైలం, సెప్టెంబరు 10: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగడంతో డ్యాం అధికారులు ఆరు క్రస్టుగేట్లను ఎత్తి దిగువ నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేశారు. జూరాల నుంచి 1,60,008 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 35,832 క్యూసెక్కులు మొత్తం 1,95,840 వరద వస్తోంది. జలాశయం ఆరు క్రస్టుగేట్లు ఎత్తి 1,64,592 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 2,45,688 క్యూసెక్కుల మేర వరద వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 883.60 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 207.9472 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,094 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. డ్యాం ఆరు క్రస్టుగేట్ల ద్వారా 1,64,592 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం.. అధికారులపై వేటు

- బనగానపల్లె ఈవోఆర్‌డీ, అప్పలాపురం కార్యదర్శి సస్పెండ్
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్



ఏ.శివరాయమ్మ



కె. ఖలీల్‌బాషా

బనగానపల్లె, సెప్టెంబరు 10: బనగానపల్లె ఈవోఆర్డీగా ఏ. శివరామయ్య, బనగానపల్లె గ్రామ పంచాయతీ ఈవోగా పనిచేసి ప్రస్తుతం అప్పలాపురం సెక్రటరీ కె. ఖలీల్‌బాషా సస్పెండ్ అయ్యారు. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కె. ఆనంద్ ఆదేశాల మేరకు కలెక్టర్ రాజకుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బనగానపల్లె ఈవోఆర్డీగా పనిచేస్తున్న శివరామయ్య, బనగానపల్లె ఈవోగా పనిచేసిన ఖలీల్‌బాషా గ్రామ పంచాయతీకి ఆదాయం రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. బనగానపల్లె మేజర్ గ్రామ పంచాయతీకి రూ.23.56 లక్షల ఆదాయం రాకుండా అక్రమ లేఅవుట్లు, భవన నిర్మాణాలను అడ్డుకోవడంలో వారు విఫలమయ్యారు. కనీసం అక్రమ వెంచర్లు, భవన నిర్మాణాలను తనికీ చేయకపోవడం, ఉన్నతాధికారులకు తెలియజేయకపోవడాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. బిల్డింగ్ డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేయకుండా భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినట్లు అధికారులు విచారణలో నిగ్గుతేల్చారు. బనగానపల్లె మేజర్ గ్రామ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆధారాలు లభించడంతో వారిపై చర్యలు తీసుకున్నారు. శివరామయ్య బనగానపల్లె ఈవోఆర్డీగా విధులకు గైర్హాజరవుతూ విధులపట్ల నిర్లక్ష్యంగా ఉండటంతో శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

3 నుంచి శ్రీగిరిపై దసరా ఉత్సవాలు

ఏర్పాట్లపై సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, సెప్టెంబరు 10: శ్రీశైలం మహాక్షేత్రంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు దసరా మహోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు దసరా మహోత్సవాల ఏర్పాట్లపై కార్యాలయం భవనంలోని సమావేశ మందిరంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, అధ్యాపక, డిప్యూటీ కార్యనిర్వహ ణాధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ ఉత్సవాలలో స్వామి, అమ్మవార్లకు జరిపించాల్సిన కైంకర్యాలు, వాహనసేవలు, అమ్మవారికి నవదుర్గ అలంకరణలు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై కూలంకుషంగా చర్చించారు. అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రపరిధిలో ఉత్సవ విశేషాలు తెలిసేలా ప్రధాన కూడళ్లలో తగినన్ని బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామోత్సవం ముంగిట జానపద కళారూపాల ప్రదర్శనను ఏర్పాటు చేయాలని ప్రజా సంబంధాల విభాగాన్ని ఆదేశించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీ



సమావేశంలో పాల్గొన్న ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 10: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ఎంపీ, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్‌పర్సన్ బైరెడ్డి శబరి అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో మంగళవారం దిశ కమిటీ చైర్మన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద మంజూరు చేసిన పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. విద్యాశాఖకు కేటాయించిన రూ.700 కోట్ల నిధులు పూర్తిస్థాయిలో వినియోగించకుండా కోట్ల రూపాయలు వెనక్కి వెళ్లిపోవడం బాధాకరమన్నారు. నందికొట్కూరులో సీడ్‌హబ్‌కు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నందికొట్కూరు, పాములపాడు, బనగానపల్లె, సంజామల తదితర మండలాల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదన్నారు. హాస్పిటల్ డెవలప్‌మెంట్ నిధులతో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. గ్రామాల్లో శ్మశానవాటికల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ నిమిత్తం కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాల అమలును పటిష్ఠవంతంగా చేపట్టి నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేయాలన్నారు. జిల్లాలో రైతులకు భూసార ఆరోగ్య కార్డులు ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆయిల్ ఫామ్ సాగు పెరిగేలా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ ఏడీకి సూచించారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రతి హెక్టార్‌కు రూ.71 వేలు సబ్సిడీ వస్తుందని చెప్పారు. రెవెన్యూ కార్యాలయాల్లో రికార్డులు భద్రపరిచే రూములు, ఓహెచ్‌ఆర్ఎస్ ట్యాంకులకు కావాల్సిన నిచ్చెలు, జడ్పీ నిధుల నుంచి ఏర్పాటు చేయాలని కలెక్టర్ చైర్మన్‌ను కోరారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ కింద కొత్త స్కీముల ద్వారా ట్యాపులు మంజూరు చేయాలని, శిథిలావస్థలో ఉన్న ఓహెచ్‌ఆర్ఎస్ ట్యాంకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న వైరల్ ఫీవర్



కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 10: గతంలో వైరల్ జ్వరాలు మందులు వేసుకున్నా, లేకున్నా 3 నుంచి 4 రోజుల్లో తగ్గిపోయేవి. ప్రస్తుతం వస్తున్న వైరల్ జ్వరాలు ఏ మాత్రం తగ్గడం లేదు. 7 నుంచి 10 రోజులపాటు జ్వరం ఉంటున్నది. 104 డిగ్రీల జ్వరం వచ్చి ఇన్‌ఫెక్షన్‌తో ఇబ్బందిపడుతున్నారు. దీని వల్ల సీఆర్పీ (సీరియాక్టివ్ ప్రొటీన్) త్వరగా పెరుగుతుంది. జ్వరంతో పాటు ప్లేట్‌లెట్ల సంఖ్య వేగంగా పడిపోతుంది. డెంగీ కేసులు అనుమానితమైనవే అధికంగా ఉన్నాయి. వారం రోజులుగా కర్నూలు జీజీహెచ్‌లో 10 డెంగీ కేసులు ఉన్నాయి. లక్షల్లో ఉండాల్సిన ప్లేట్‌లెట్ల కౌంట్ల సంఖ్య వేలల్లో ఉంటుంది. చాలా మందికి రక్తంలో ప్లేట్‌లెట్లు తక్కువగా ఉన్నాయి. వెంటనే ఎక్కించాలని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు రోగులకు దోపిడీ చేస్తున్నాయి. ఇక మురికివాడలా రోగులు ఆర్థిక భారంతో ప్రైవేటు ఆసుపత్రులకు ఎక్కువగా క్యూ కడుతున్నారు.

పరీక్షలు తప్పవా...?

వైరల్ జ్వరం వచ్చిన వారు తప్పనిసరిగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలను వైద్యులు తప్పనిసరిగా రాయిస్తున్నారు. ప్రైవేటు ల్యాబ్‌లో రోగులను దోపిడీ చేస్తున్నారు. దీంతో నిరుపేదలు వీటి కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. పీహెచ్‌సీలో ఈ పరీక్షలన్నీ సరిగ్గా అందుబాటులో లేకపోవడంతో ఎక్కువ మంది ప్రైవేటు వైపు మొగ్గు చూపుతున్నారు.



జిల్లాను జ్వరాలు వణికిస్తున్నాయి. వాతావరణ మార్పులతో జ్వరాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు, గ్రామాల్లో పారిశుధ్య లోపాలు మొదలైన కారణాల వల్ల సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పట్టణాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ప్రైవేటు హాస్పిటళ్లకు రోగులు పరుగులు తీస్తున్నారు. చాలా ఇండ్లలో చిన్నారుల నుంచి పెద్దల వరకు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం, నొప్పులతో రోగులు అల్లాడిపోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా డయోగ్నస్టిక్ సెంటర్ల వద్ద రద్దీ పెరిగింది. వైరస్ కారణంగా జ్వరాలు వ్యాపిస్తున్నాయని గుర్తించినా వ్యాధికారక వైరస్ ఏమిటో తెలియడం లేదు.

రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



మెడికల్ ఓపీని చూస్తున్న వైద్యులు



ప్రమాదకరంగా డెంగీ

జిల్లాలో డెంగీ కేసులు అధికంగా ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 221 కేసులు నమోదు కాగా, ఇందులో కర్నూలు అర్బన్‌లో 65 డెంగీ పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. శరీన్‌నగర్, వీకర్‌సెక్షన్ కాలనీ, బుధవారపేట, ముజఫర్‌నగర్ వంటి స్లమ్ ఏరియాలో డెంగీ అధికంగా ఉంది. ఇక కర్నూలు మండలంలో 16, దేవనకొండల 15, ఉలిందకొండలో 14, సి.బెళగల్‌లో 13, నందవరంలో 10, కల్లూరులో 7, ఆస్పరిలో రక్తపూతల పరీక్షలు 2.80 లక్షలు మంది నిర్వహించగా... 8 మందికి వ్యాధి నిర్ధారణ అయింది.

వైరల్ ఫీవర్‌లే ఎక్కువ



కొద్ది రోజులుగా ఆసుపత్రికి వైరల్ ఫీవర్ కేసులు అధికంగా వస్తున్నాయి. వాతావరణంలో మార్పులు వర్షాల వల్ల జ్వరంతో పాటు జలుబు, కీళ్ల నొప్పుల లక్షణాలు ఉంటున్నాయి. కానీ వైరల్ ఫీవర్ పట్ల భయపడాల్సిన అవసరం లేదు. జ్వరం ఉన్న చాలా కేసులు అడ్మిట్ చేసుకోవడం లేదు. మంగళవారం మెడికల్ ఓపీకి 400 మంది రాగా ఇందులో 30 మంది అడ్మిట్ అయ్యారు. వీటిలో 20 కేసులు వైరల్ ఫీవర్ కేసులే ఉన్నాయి. రెండు రోజులకు మించి జ్వరం ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

\- డా. లక్ష్మీబాయి, ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ కర్నూలు సర్వజన వైద్యశాల

నెల రోజులుగా బాధపడుతున్నా



జ్వరం, కాళ్ల నొప్పులు, వాపులతో ఉదయం మెడికల్ ఓపీకి వచ్చారు. నెల రోజులైనా కాళ్ల నొప్పులు, వాపులు తగ్గడం లేదు. ఇప్పటికే పెద్దాసుపత్రికి ఐదుసార్లు తిరిగాను. చికెన్ గున్యా అంటూ మందులు వాడినా తగ్గడం లేదు.

\- బాలన్న, డోన్ మండలం కనపకుంట

జ్వరం తగ్గడం లేదు



నెల రోజుల నుంచి ఆసుపత్రికి తిరుగుతున్నా ఏ మాత్రం జ్వరం తగ్గడం లేదు. సరిగ్గా ఆకలి కావడం లేదు. ఇన్ని రోజులు ఎప్పుడూ జ్వరం ఉండలేదు. ఆసుపత్రిలో మందులు వేసుకున్నా అవి సరిగా పని చేయడం లేదు.

\- ఫిరోజ్ ఖాన్, రోగి

వరద సాయంగా రూ. 10 లక్షలు

సీఎంకు అందించిన ఎంపీ బస్తిపాటి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఎంపీ బస్తిపాటి నాగరాజు ముందుకు వచ్చారు. మంగళవారం విజయవాడ కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబు నాయుడును కలిసి రూ. 10 లక్షల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వరద బాధితులకు అండగా నిలిచిన ఎంపీని సీఎం చంద్రబాబు అభినందించారు. వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి తోచిన సాయం అందించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు.



సీఎంను కలిసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఎమ్మెల్యే బీవీ రూ.10 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు : వరద బాధితుల సహాయార్థం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి రూ.10 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు. మంగళవారం వరద తాకిడికి గురైన ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి మూడు నెలల వేతనంతో పాటు గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు టీడీపీ నాయకులు సేకరించిన రూ.5 లక్షలను సీఎం సహాయ నిధికి చెల్లించారు.

టీడీపీ నేత వహీద్ రూ.3.6 లక్షలు

నంద్యాల కల్చరల్ : విజయవాడ వరద బాధితులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుస్సేన్ అండగా నిలిచారు. తనవంతు సహాయం రూ.3.6 లక్షల చెక్కును సీఎం చంద్రబాబు నాయుడుకు మంగళవారం అందజేశారు. వరదబాధిత ప్రాంతాల్లో ఆయన పర్యటిస్తూ పలు సేవా కార్యక్రమాలతో పాటు దుస్తులను కూడా పంపిణీ చేశారు.



చెక్కును అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుస్సేన్

లా సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 10: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో లా 5,7,9 సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉస్మానియా కళాశాలలో ఏర్పాట్లను ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ ఎస్. వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈనెల 20వ తేదీ వరకు జరిగే పరీక్షలకు సంబంధించి రెండు సెషన్స్‌లో జరుగుతాయని ప్రతి విద్యార్థి పరీక్షల నిబంధనలను తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. ఉదయం 307 మంది హాజరుకాగా, 13మంది, మధ్యాహ్నం 56 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరు అయ్యారని పేర్కొన్నారు.

కుందూనదిలో వైద్య మందులు!

నీరు కలుషితమయ్యే ప్రమాదం

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 10: మండలంలోని రూపనగడి గ్రామ కుందూనది వంతెన సమీపంలో వైద్య మందులు, సూదులు, ట్యాబ్లెట్లు, అట్టపెట్టలు భారీగా ప్రత్యక్షమయ్యాయి. మంగళవారం కుందూనదిలోకి వెళ్లే రస్తాలో మందులు కనిపించాయి. మండలంలో ఉయ్యాలవాడ, మాయలూరు, పెద్దయమ్మనూరు గ్రామాల్లో ప్రాథమిక వైద్యశాలలు ఉండగా, ఆయా గ్రామల్లో దాదాపుగా పది మంది ఆర్ఎంపీలు ఉన్నారు. నదిలో పడేసిన మందులను ప్రభుత్వ సిబ్బంది పడవేశారా? లేక ఆర్ఎంపీలు వేశారా? అన్నది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే కాలం చెల్లిన మందులను ఇలా వేయడం వల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై వైద్యాధికారి వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.



నీళ్లలో తేలియాడుతున్న ట్యాబ్లెట్లు, టానిక్ సీసాలు, అట్టపెట్టెలు

విశాఖ ఉక్కు సామర్థ్యాన్ని పెంచడంలో ప్రభుత్వం విఫలం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు సామర్థ్యం పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని కార్మిక, రైతు సంఘాల నాయకులు విమర్శించారు. విశాఖపట్టణం ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు తలపెట్టిన రాస్తారోకో కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐకేఎస్, ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో రాజవిహార్ కూడలిలో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి రాజవిహార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన రాస్తారోకోకు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. అంజిబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి. శ్రీనివాసులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగిన పోరాటంలో 32 మంది అమరవీరుల బలిదానంతో ఏర్పాటైన ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. మూడు సంవత్సరాలుగా ఉద్యమం నడుస్తున్న కూడ కేంద్రంలో ఉన్నటువంటి బీజేపీ ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయాలనే ఉద్దేశంతో ఆదానికి అప్పజెప్పడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బి. వెంకటేష్, టి.రామాంజనేయులు, కిట్టు, పురుషోత్తం, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో



ర్యాలీగా వస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

- ట్రాఫిక్ సమస్య.. ఏఐటీయూసీ, సీఐటీయూ అధ్వర్యంలో రాజ్‌విహార్‌లో నిర్వహించిన రాస్తారోకోలో భాగంగా అరగంట సేపు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కొత్తబస్టాండు నుంచి నందికొట్కూరు, నంద్యాల వెళ్లే ఆర్టీసీ బస్సులను బళ్లారి చౌరస్తా మీదుగా వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణ



జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుంటున్న మురళీ కృష్ణ

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 10: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషాతో పాటు నూతన జిల్లా అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీకి పునాదిలాంటి వారన్నారు. ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో సీనియర్లు, జూనియర్లు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను అందరిని కలుపుకుని పని చేస్తానన్నారు. ఈ నెలలోనే డీసీసీ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని, ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. అంతకుముందు సీక్యాంప్ సెంటర్‌లోని దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి, రాజ్‌విహార్ సెంటర్‌లోని ఇందిరా గాంధీ, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి, కోట్ల విజయభాస్కరరెడ్డి, అంబేడ్కర్, దామోదరం సంజీవయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, మాజీ డీసీసీ అధ్యక్షుడు బాబురావు, పీజీ నరసింహులు యాదవ్, బజారన్న, ప్రమీల, వెంకట సుజాత తదితరులు పాల్గొన్నారు.

మినుము పంటపై గడ్డి మందు పిచికారి

ఏడుగురిపై కేసు నమోదు

రుద్రవరం, సెప్టెంబరు 10: మండలంలోని శ్రీరంగాపురానికి చెందిన పోలుబోయిన వెంకటక్రిష్ణ అనే రైతు సుమారు నాలుగు ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. సోమవారం అర్ధరాత్రి మినుము పంటపై అదే గ్రామానికి చెందిన బీరం వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, వెంకట శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట ప్రశాంత్‌రెడ్డి, నాగిరెడ్డి, గౌతంరెడ్డి, చిన్నవెంకటరెడ్డి అనే వ్యక్తులు గడ్డి మందు పిచికారి చేశారని మంగళవారం బాధిత రైతు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పై ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు.

పారా మెడికల్ రెండో విడత కౌన్సెలింగ్ పూర్తి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 10: పారా మెడికల్ కోర్సులకు 2024-25 విద్యాసంవత్సరానికి రెండో విడత కౌన్సెలింగ్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ పారా మెడికల్ కోర్సులలో మిగిలిన సీట్లకు మెరిట్, రోస్టర్ ప్రకారం భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఏ కారణం చేతనైనా ఫీజు చెల్లించకపోతే ఆ సీట్లను ఈ నెల 17న జరిగే మూడో కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ పి.హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అనిల్ కుమార్ రెడ్డి, ఏవో లక్ష్మీ ప్రసన్న, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 10: కర్నూలు జిల్లాకు సంబంధించి రూ.15,068.46 కోట్లతో కూడిన 2024-25 వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ఖరీఫ్‌లో రూ.2,873.96 కోట్లు, రబీలో రూ.1,997.16 కోట్లు, అగ్రికల్చర్ టర్మ్ లోన్స్ రూ.2,318.18 కోట్లు, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.88.03 కోట్లు కలిపి మొత్తం వ్యవసాయ రంగానికి రూ.7,746.84 కోట్లుగా ప్లాన్ రూపొందించారు. అదేవిధంగా సూక్ష్మ, చిన్న మధ్యతరహా సంస్థలకు రూ.2,560.77 కోట్లు, విద్యారంగానికి రూ.198.26 కోట్లు, హౌసింగ్‌కు రూ.913.99 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాలకు రూ.39.65 కోట్లు, పునరుత్పాదక శక్తికి రూ.32.01 కోట్లు, ఇతర రంగాలకు రూ.636.7 కోట్లు మొత్తం కలిపి ప్రాధాన్యతా రంగాలకు రూ.12,128.22 కోట్లు కేటాయించారు. ఇక ఇతర రంగాలకు రూ.2,940.24 కోట్లతో ప్రణాళికలు రూపొందించారు. ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు వాయిదా

కల్లూరు, సెప్టెంబరు 10: విద్యుత్‌శాఖలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరి షెడ్ల(ఎస్‌పీఎం) టెండర్లను వాయిదా వేసినట్లు ఎస్ఈ యం.ఉమాపతి మంగళవారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరీ షెడ్లకు సంబంధించిన ఈ-టెండర్ నోటిఫికేషన్ ఈనెల 2వ తేదీన ఇవ్వగా 19న టెండర్లు ఖరారు చేయాల్సి ఉంది. పలు అనివార్య కారణాల వల్ల టెండర్లను వాయిదా వేసినట్లు ఎస్ఈ వెల్లడించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 11 ఎస్‌పీఎం షెడ్లు ఉండగా అందులో 8 ప్రైవేట్, 3 విద్యుత్‌శాఖకు చెందినవిగా ఉన్నాయి.

ఐకార్‌లో మెరిసిన డోన్ విద్యార్థిని త్రిలేఖ

ఆలిండియాలో ఫస్ట్ ర్యాంకు



డోన్, సెప్టెంబరు 10: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐకార్) ఎంట్రెన్స్ పరీక్షలో డోన్ విద్యార్థిని దుర్గం త్రిలేఖ మెరిసారు. ఆలిండియా లెవల్‌లో ఈడబ్ల్యూఎస్ కోటాలో మొదటి ర్యాంకు సాధించి అత్యుత్తమ ప్రతిభను చాటారు. డోన్ మండలంలోని జగదుర్తి గ్రామానికి చెందిన లక్ష్మీకాంతారెడ్డి, అరుణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కూతురు త్రిలేఖ మహానంది వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేశారు. 10వ తరగతి చదివే సమయంలోనే తండ్రి లక్ష్మీకాంతరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తల్లి అరుణ ప్రోత్సాహంతో త్రిలేఖ చదువులో పట్టుదలతో రాణించారు. బెంగుళూరు జీకేవీకే కళాశాలలో ఎంఎస్సీ సెరికల్చర్ పూర్తి చేశారు. మంగళవారం విడుదలైన ఐకార్ ఎంట్రెన్స్ పరీక్ష ఫలితాల్లో త్రిలేఖ ఆలిండియా లెవల్‌లో ఈడబ్ల్యూఎస్ కోటాలో నెంబర్ వన్ ర్యాంకును త్రిలేఖ సాధించారు.

నాలుగేళ్ల బాలికకు డెంగీ

తెర్నెకల్‌లో కేసు నమోదు

దేవనకొండ, సెప్టెంబర్10: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో నాలుగు సంవత్సరాల బాలికకు డెంగీ సోకినట్లు జిల్లా అసిసెట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. వ్యాధి వచ్చిన బాలిక ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో సర్పంచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది యాంటీ లార్వా ఆపరేషన్, ఇంటింటికి తిరిగి లార్వా చేయించారు. అలాగే 50 ఇళ్ల లోపల కూడా స్ప్రేయింగ్ చేయించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. దేవనకొండలోని కేజీబీవీ స్కూల్‌ను సందర్శించి పిల్లల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. జ్వరం వచ్చిన వెంటనే పిల్లలకు రక్త పరీక్షలు చేయించాలని, అక్కడ ఉన్న హెచ్ఎం, ఏఎన్ఎంలకు తెలియజేశారు. పిల్లల ఆరోగ్యం పట్ల అశ్రద్ధవహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సూపర్‌వైజర్లు రంగస్వామి, శ్రీధర్, సీహెచ్ఓ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ సభ్యురాలిపై హత్యాయత్నం

కత్తితో పొడిచిన వైసీపీ నాయకుడు కురువ మల్లయ్య

కోసిగి, సెప్టెంబరు 10: కోసిగి వైసీపీలో రాజకీయ ముసలం రాజుకుంది. ఒకే పార్టీలో కొనసాగుతూ హత్యా రాజకీయాలకు తెరలేపారు. వైసీపీ నాయకురాలు, మాజీ జడ్పీటీసీ దలవాయి మంగమ్మపై అదే పార్టీకి చెందిన కురువ మల్లయ్య కత్తితో దాడి చేశాడు. మంగళవారం కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో ఉన్న సాయిబాబా గుడి సమీపంలో ఉన్న తన ఇంట్లో స్నేహితురాలు ఈరమ్మ, ఆమె మనుమడుతో కలిసి మంగమ్మ ఉన్నారు. ఆ సందర్భంగా వైసీపీ నాయకుడు కురువ మల్లయ్య ఆస్తి తగాదాల్లో ఒకరిపై ఒకరు వాదోపవాదాలు చేసుకొని సహనం కోల్పోయి వెంట తెచ్చుకున్న కత్తితో మంగమ్మ కడుపులో పొడిచారు. ఆమె రక్తస్రావమై కుప్పకూలిపోయారు. కోసిగి పోలీస్‌స్టేషన్‌లో కురువ మల్లయ్యపై ఫిర్యాదు చేసి చికిత్స కోసం కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. దలవాయి మంగమ్మ, కురువ మల్లయ్య గత ఐదేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నారు. దలవాయి మంగమ్మ మాట్లాడుతూ ఆస్తి విషయమై కురువ మల్లయ్య కత్తితో పొడిచాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.



తీవ్ర రక్తగాయాలతో మంగమ్మ

బాలుడి శవం లభ్యం

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 10: అహోబిలం గణేష్ నిమజ్జనం సందర్భంగా తెలుగుగంగలో గల్లంతైన బాలుడు లాల్‌బాషా (12) శవం మంగళవారం లభ్యమైంది. తెలుగుగంగలో గల్లంతైన బాలుడు అహోబిలం గ్రామం నుంచి బాచేపల్లెకు వెళ్లే రహదారి వంతెన వద్ద కంపచెట్లలో లభ్యమైందని పోలీసులు చెప్పారు. బాలుని శవాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

కర్నూలు, సెప్టెంబరు 10: తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని గార్గేయపురం సమీపంలో విక్రమ్ కుమార్ (23) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన విక్రమ్ కుమార్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య పుట్టినిల్లు పగిడ్యాల. భార్య డెలివరీ కావడంతో ఉల్చాల నుంచి మోటారు సైకిల్‌పై సోమవారం మధ్యాహ్నం బయలుదేరాడు. గార్గేయపురం వద్ద బొలేరో వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆయన స్థానికులు, పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. తండ్రి జోతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



విజయవాడలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు/కొత్తపల్లి, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. విజయవాడలోని 59వ డివిజన్‌లో బియ్యం, నూనె, కందిపప్పు, 5 రకాల కూరగాయలు ఒక కిట్టుగా తయారు చేసి 3 వేల కిట్లను విజయవాడలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకటరెడ్డి సహకారంతో ఈ నిత్యావసర వస్తువుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వరద వల్ల సర్వం కోల్పోయిన వారికి టీడీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, కాతా రమేష్‌రెడ్డి, గిరీశ్వర‌రెడ్డి, ముర్తుజావళి, వేణుగోపాల్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు'



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎన్‌ఎండీ ఫయాజ్, డా. రవికృష్ణ

నంద్యాల క్రైం, సెప్టెంబరు 10: సమస్యలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని, ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని టీడీపీ రాష్ట్ర నాయకుడు ఎన్‌ఎండీ ఫయాజ్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ అన్నారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా నంద్యాల ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో జీఎస్ఆర్ ఆస్పత్రి వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి నుంచి పద్మావతినగర్ వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత అని అన్నారు. సమస్యలను దీటుగా ఎదుర్కొని జీవించడమే మనిషి కర్తవ్యమన్నారు. డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, జీఎస్ఆర్ ఆస్పత్రి ప్రముఖ మానసిక వ్యాధి నిపుణురాలు డా. హారిఫాభాను, డా.మహమ్మద్ రఫీ, నంద్యాల ఐఎంఏ శాఖ వైద్య బృందం, నంద్యాల రోటరీ క్లబ్ ప్రతినిధులు, మానవ హక్కుల స్వచ్ఛంద సంస్థ నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాణ్యం: ఆత్మహత్యల ముందు సమస్యలు చిన్నవని, సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు అని ఆర్‌బీఎస్‌కె (రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమ్) జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కాంతారావునాయక్ అన్నారు. మంగళవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మానసిక వైద్యులు డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ రవూఫ్ ఇబ్రహీం, వెంకటరామిరెడ్డి, కళాశాల డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, ఈసీఈ హెచ్‌వోడి సోఫియా ప్రియదర్శిని, స్టాఫ్‌నర్స్ భవ్యలక్ష్మి, ఏఎన్ఎంలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'పరిహారం అందించాలి'



సచివాలయ ఉద్యోగికి వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 10: తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, మండల కార్యదర్శి వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం వడ్లరామాపురం, బాపనంతాపురం, నల్లకాలువ గ్రామాల్లో సచివాలయ అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. గ్రామ రైతులు పాల్గొన్నారు.

'ఈకేవైసీ పూర్తి చేయాలి'

నంద్యాల రూరల్, సెప్టెంబరు 10: పంట నమోదు, ఈకేవైసీని మూడు రోజుల్లో పూర్తి చేయాలని నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజశేఖర్ సూచించారు. నంద్యాల మండలంలోని పాండురంగాపురం, కానాల గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలోని పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. గ్రా వ్యవసాయ సహాయకులు ప్రతి రైతుకు ఈకేవైసీ చేయించాలన్నారు. మండల వ్యవసాయాధికారి ప్రసాదరావ్, వీఏఏలు పాల్గొన్నారు.

'ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దాం'

నంద్యాల రూరల్, సెప్టెంబరు 10: రజక ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దామని ఆల్‌ఇండియా ధోబీ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లెల్ల శ్రీరాములు అన్నారు. మంగళవారం ఆయన స్వగృహంలో ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీరాములు మాట్లాడుతూ అట్టడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికోసం ఆమె ఎర్రజెండా చేతబట్టి సాయుధ పోరాటం చేశారన్నారు. అంతేగాక తెలంగాణ వరంగల్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ అంతటా పేదలకు భూములు పంచాలని తుపాకి చేతపట్టి లక్షల ఏకరాలను పేదల జీవనం కోసం పంచి పెట్టడం జరిగిందన్నారు.

'చర్యలు తీసుకోవాలి'

నందికొట్కూరు, సెప్టెంబరు 10: వినాయక మండపానికి రూ.1,100 ఇస్తేనే కరెంట్ ఉంటుందని, లేదంటే కట్ చేస్తామంటూ విద్యుత్‌శాఖ హెల్పర్లు బెదిరిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు విద్యుత్‌శాఖ కార్యాలయం ముందు మంగళవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేష్ మాట్లాడుతూ చిన్నారులతో దురుసుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. హెల్పర్ల తీరుపై అసహనంతోనే ఏ.ఈ కార్యాలయాన్ని ముట్టడించామన్నారు. గణేశ్ కేంద్ర ఉత్సవ కమిటీ సభ్యులు ఆర్టు శ్రీను, శేఖర్ శివ తదితరులు పాల్గొన్నారు.

'చెంచులు జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 10: నల్లమల చెంచు గిరిజనులు తమ జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలని శ్రీశైలం ఐటీడీఏ మేనేజర్ కేజీనాయక్, ఆత్మకూరు ఎంపీడీవో మోహన్‌కుమార్ సూచించారు. ప్రధానమంత్రి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెచ్చెర్వు, ఇందిరేశ్వరం, కొట్టాలచెరువు చెంచుగూడేలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెచ్చెర్వులోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఏపీఎం ఉమాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివమ్మ, ఏపీవో నాగార్జున రులు ఉన్నారు.

'పంట సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

గడివేముల, సెప్టెంబరు 10: వర్షాలకు పంటలు దెబ్బతినకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు వెంకటరమణ, అశోక్‌కుమార్, వెంకటరమణమ్మ, ప్రవీన్‌లు రైతులకు సూచించారు. మంచాలకట్ట, గని గ్రామాల్లో మంగళవారం వారు మొక్కజొన్న, సోయా చిక్కుడు, కంది పంటను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హేమ సుందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



విరాళం సేకరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 10: విజయవాడలో సంభవించిన వరదలతో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలుద్దామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం ఎమ్మెల్యే స్వయంగా విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరానికి వరద సంభవించడం బాధాకరమని అన్నారు. ప్రకృతి విపత్తులను ఆపలేనప్పటికీ ఆ విపత్తుల్లో నష్టపోయిన బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఇందులో భాగంగానే శ్రీశైలం నియోజకవర్గం తరుపున రూ.కోటి విరాళాలను సేకరించాలని తాము నిర్ణయించినట్లు తెలిపారు. సమకూరిన నిధిని సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కు రూపంలో త్వరలో సీఎం చంద్రబాబుకు అందజేయనున్నట్లు వివరించారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు తమనేత చంద్రబాబు నిద్రాహారాలు మాని పనిచేస్తుంటే వైసీపీ నాయకులు ఇంకితజ్ఞానం లేకుండా విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఓ వైపు వరదలతో విజయవాడ వాసులు అవస్థలు పడుతుంటే సాయం చేయాల్సిన వైసీపీ నాయకులు ఇంట్లో కూర్చొని తప్పుడు స్టేట్‌మెంట్లు ఇవ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. చివరికి పడవలతో ప్రకాశం బ్యారేజీని కూల్చాలన్న కుట్రలకు వైసీపీ నేతలు పాల్పడటం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలన్న లక్ష్యంతో వైసీపీ పనిచేస్తోందని విమర్శించారు. అయితే వైసీపీ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు. ఎవరెన్ని కుట్రలు చేసిన సీఎం చంద్రబాబు వరద బాధితులకు అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కలిముల్లా, నాయకులు రామ్మూర్తి, రామసుబ్బయ్య, నాగూర్‌ఖాన్, కొండలరావు, దినకర్, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, శేషకుమార్ ఉన్నారు.

ఘనంగా నిమజ్జనం



గడివేములలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

గడివేముల, సెప్టెంబరు 10: మండల కేంద్రంలో మంగళవారం వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. వినాయక చవితి సందర్భంగా మండపాల్లో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వినాయక ప్రతిమలను మంగళవాయిద్యాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ జై బోలో గణేష్ మహరాజ్‌కు జై అంటూ కేరింతలు కొట్టారు. అనంతరం విగ్రహాలను కుందూనదిలో నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ సీసీ నాగార్జునరెడ్డి పోలీసు బందోబస్తు చేపట్టారు.

వెలుగోడు: మండలంలోని వేల్పనూరు గ్రామంలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వెలుగోడు: వేల్పనూరు గ్రామంలో..

మట్టి విగ్రహాల తయారీలో డిగ్రీ విద్యార్థి



వినాయక విగ్రహంతో యువకుడు

పాణ్యం, సెప్టెంబరు 10: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మట్టివిగ్రహాలను తయారీ చేస్తూ పర్యావరణ ప్రేమికుడిగా నిలిచాడు పాణ్యం గ్రామానికి చెందిన ఏదు వెంకటసుబ్బమ్మ, వెంకటసుబ్బయ్య కుమారుడు ఫణీంద్రకుమార్. ఈ యువకుడు నంద్యాల నేషనల్ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. గత మూడేళ్లుగా రసాయన రహిత రంగులతో మట్టి విగ్రహాన్ని తయారు చేస్తున్నట్లు తెలిపాడు. దాదాపు ఎనిమిది అడుగుల ఎత్తులో మట్టి విగ్రహాలు తయారు చేస్తున్నట్లు ఆ యువకుడు తెలిపాడు. యువకుడు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి చిన్న చిన్న విగ్రహాలను తయారు చేస్తూ అలవాటుగా మారిందన్నారు. యూట్యూబ్‌లోని నైపుణ్యంతో విగ్రహాలను తయారు చేస్తున్నట్లు తెలిపాడు. విగ్రహ మట్టి ఖర్చుకు కేవలం ఐదు వందల రూపాయలు ఖర్చవుతుందని రంగులకు రెండు నుంచి నాలుగు వేలు అవుతుందని చెప్పాడు.

గణనాథుడికి పూజలు



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 10: వరసిద్ధి వినాయక విశేష పూజా కార్యక్రమాలలో భాగంగా నంద్యాల పట్టణంలోని పలు కూడళ్ల వద్ద ప్రతిష్ఠించిన గణనాథులకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అష్టోత్తరాలు, వినాయకపూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రసాదం పంపిణీ చేశారు. 6వ వార్డులోని ఆత్మకూరు బస్టాండు వద్ద ఏర్పాటుచేసిన గణేష్ పూజా కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు వెంకటసుబ్బయ్య, శంకర్, 24వ వార్డు ఇన్‌చార్జి చలపతి, విశ్వేశ్వరరెడ్డి, మహేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

కొత్తపల్లి, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొత్తపల్లి మండలంలో పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. మండలంలోని నందికుంటలో మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన క్రాప్ డిస్లెన్స్‌పై ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కొక్క రైతుకు రూ.20వేలు చెల్లించాలని, ఒక్కొక్క రైతుకు రూ.లక్ష వరకు బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని కోరారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించకూడదని, జీవో నెంబరు 22ను వెంటనే రద్దు చేసి ఉచిత కరెంటు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నందికుంట గ్రామ సచివాలయ అడ్మిన్‌కు ఆ పార్టీ నాయకులతో కలిసి రాజశేఖర్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఈరన్న, రైతులు పాల్గొన్నారు.

నేడు నందికొట్కూరులో నిమజ్జనం

నందికొట్కూరు, సెప్టెంబరు 10: గణనాథుడి నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బేబి తెలిపారు. పట్టణంలోని పటేల్ సెంటర్‌లో గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సభాస్థలిని మంగళవారం ఆమె పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణంలో సుమారు 80 గణనాథుడి విగ్రహాలు కొలువుదీరారన్నారు. నిమజ్జనానికి కావల్సిన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పారిశుద్ధ్యం తదితర అవసరాల కోసం కార్మికులను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేశామన్నారు. ఈ విగ్రహాలు మండపాల వద్ద అంతిమ పూజలు అందుకొని పట్టణంలో ఊరేగింపుగా బయలుదేరి జూపాడుబంగ్లా వద్ద ఉన్న కేసీ కాలువలో గంగ ఒడిలోకి చేరుతారని గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీధర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో నిమజ్జన వేడుకలు జరుపుకోవాలని విగ్రహ కమిటీ సభ్యులకు సూచించారు.

మహానందిలో పీఠాధిపతి పూజలు



పీఠాధిపతిని సన్మానిస్తున్న ఆలయ వేద పండితులు

మహానంది, సెప్టెంబరు 10: మహానంది క్షేత్రంలో అనంతపురం జిల్లా శివకోటి శ్రీపీఠం వ్యవస్థాపకులు అప్పాస్వామి మంగళవారం పూజలు నిర్వహించారు. పీఠాధిపతికి, శిష్య బృందానికి ఆయల వేదపండితులు ఆలయ ముఖ మండపం వద్ద స్వాగతం పలికారు. అనంతరం మహానంది క్షేత్రంలో నందీశ్వరునికి, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతు శర్మ, అర్చకులు, శరబయ్య తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి ఆదాయం రూ.35 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మహానంది, సెప్టెంబరు 10: భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మహానంది దేవస్థానానికి రూ.35,20,076 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం మహానంది క్షేత్రంలోని కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి ఆలయంలోని హుండీలను ఉద్యోగులు, భక్తులు, సేవకుల ఆధ్వర్యంలో లెక్కింపు చేశారు. మహానంది క్షేత్రంలోని ఉభయ దేవాలయాల హుండీల ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. 49 రోజులకు గానూ ఈ ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

'విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తగదు'



నందికొట్కూరులో రాస్తారోకో చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



ఆత్మకూరులో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ఎన్నో ఉద్యమాలు, పోరాటు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం తగదని ఏఐటీయూసీ నాయకులు నందికొట్కూరు పట్టణంలో రాస్తారోకోలు నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ మహిళా సంఘం జిల్లా నాయకులు రజితమ్మ, భాను, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, మహానంది, ఏఐటీయూసీ నాయకులు రాముడు, చిన్ని, జగదీష్, ప్రతాప్, చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

● విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని సీఐటీయూ నాయకులు గోపాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్ సాహెబ్ అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం తగదని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నందికొట్కూరు మార్కెట్ యార్డు సమీపంలో కేజీ రోడ్డుపై కార్మికులు రాస్తారోకో చేపట్టారు. సీఐటీయూ యకులు రాము, శివ, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు బాబు, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణ, పాండు, స్వాములు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయడంతో పాటు పూర్తిస్థామర్థ్యంతో స్టీల్ ఉత్పత్తి చేయాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వాములు డిమాండ్ చేశారు. మంగళవారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో ఆత్మకూరులోని కేజీ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. నాయకులు సద్దాం, గణపతి, మల్లయ్య, రవి, కలిముల్లా, చాంద్, మాబాషా ఉన్నారు.

పంట నమోదుకు గడువు పెంపు

నందికొట్కూరు, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన వర్షాలకు వరదల్లో నష్టపోయిన పంటలు, ఇళ్లు తదితర వాటిని నమోదు చేసేందుకు మరో రెండు రోజులు పెంచారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కురిసిన వర్షాలకు నీట మునిగి, దెబ్బతిన్న పంటలను నమోదు చేసేందుకు ఈనెల 9వ తేదీతో గడువు ముగిసిందని చెప్పారు. అయితే నియోజకవర్గంలో చాలా మంది రైతుల నుంచి సమాచారాన్ని అధికారులు సేకరించకపోవడంతో మరో రెండు రోజులు గడువు పెంచాలని కలెక్టర్ రాజకుమారిని ఎమ్మెల్యే కోరినట్లు తెలిపారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ మరో రెండు రోజుల వరకు నష్టపోయిన పంటల వివరాలను ఈనెల 11వ తేదీ వరకు సేకరించాలని వ్యవసాయశాఖ ఏడీఏలను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. కావున నష్టపోయిన రైతుల నుంచి వ్యవసాయశాఖ అధికారులు వివరాలను సేకరించి రైతులకు మేలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి, సెప్టెంబరు 10: కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మేరీ మంగళవారం తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కిచ్చెన్నగారి కుసుమలత అధ్యక్షతన జరుగుతున్న నేపథ్యంలో ఆయా శాఖల మండల అధికారులు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు. అలాగే ఆయా శాఖల మండల అధికారులు గత మూడు నెలలకు సంబంధించిన అభివద్ధి నివేదిలతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాణ్యం, సెప్టెంబరు 10: రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు శాంతిరాం విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఆయన మట్లాడుతూ నంద్యాల గుడ్ షెపర్డ్ పాఠశాల వద్ద జరిగిన రాష్ట్రస్థాయిఎంపిక పోటీలలో కళాశాల విద్యార్థులు ఉదయ్ కిరణ్, శ్రీలత, శ్రీవాణి, జతిన్‌లు ఎంపికైనట్లు తెలిపారు. విశాఖపట్నం జిల్లా అనపర్తిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, పీడీ చంద్రారెడ్డి అభినందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

పాణ్యం, సెప్టెంబరు 10: మండలంలోని జంబులా పరమేశ్వరి ఆలయ అభివృద్ధికి భక్తులు నగదు విరాళం ఇచ్చినట్లు ఆలయ ధర్మకర్త బొమ్మిశెట్టి శేఖర్ తెలిపారు. నంద్యాల పట్టణం, నూనెపల్లెకు చెందిన ఉపాధ్యాయుడు సోమగాని వెంకటగౌడ్, పద్మ దంపతులు మంగళవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.15,016 ఆలయ ధర్మకర్తకు అందజేశారు. ఆలయ సిబ్బంది భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. సోమగాని కోమల్‌గౌడ్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

'అతిసార కేసులు లేవు'

పాములపాడు, సెప్టెంబరు 10: మండలంలోని వేంపెంట గ్రామంలో అతిసార కేసులు లేవని మండల వైద్యాధికారి నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ గత నెల గ్రామంలో వాంతులు విరేచనాలు అవుతుండటంతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని, మొత్తం 36 కేసులు రాగా వారందరూ ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు. గత వారం రోజులుగా ఒక్క కేసు కూడా రాకపోవడంతో మెడికల్ క్యాంపును తొలగిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారని, అత్యవసరమైతే తాము కూడా వెళ్తామని తెలిపారు.

వార్డు సభ్యురాలి మృతి

గోస్పాడు, సెప్టెంబరు 10: మండలంలోని తేళ్ళపూరి గ్రామ పంచాయతీకి చెందిన వార్డు మెంబరు తిరుపతి వెంకటలక్ష్మమ్మ (80) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. సర్పంచ్ కాటంరెడ్డి సుధామణి, మండల టీడీపీ కన్వీనర్ తులసీశ్వరరెడ్డి వార్డు మెంబరు వెంకట లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మసీదులో చోరీ

పాములపాడు, సెప్టెంబరు 10: మండలంలోని ఇస్కాల గ్రామంలోని మసీదులో చోరీ జరిగింది. ఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాలివీ.. మసీదులో సోమవారం అర్థరాత్రి దాటక తాళాలు పగులగొట్టి లోపల గోడలో ఉన్న ఇనుప హుండీని ఎత్తుకెళ్లారు. గ్రామ శివారులో హుండీని పగులగొట్టి అందులోని నగదును తీసుకొని హుండీని అక్కడే వదలి వెళ్లారు. అందులో సుమారు రూ.10వేల రూపాయలు ఎత్తుకెళ్లారని, మసీదు మౌజన్ ఖాజాహుస్సేన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

కొత్తపల్లి, సెప్టెంబరు 10: మండలంలోని గుమ్మడాపురం ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్‌పై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆత్మకూరు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ అన్వరాబేగం తెలిపారు. మంగళవారం ఏపీడీ గుమ్మడాపురం గ్రామ సచివాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్‌పై వచ్చిన ఆరోపణలపై గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంపత్ గ్రామాల్లో ఉపాధి పనులు పెట్టడం లేదని, గత సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లో ఓ రాజకీయ పార్టీకి ఏజెంటుగా కూర్చున్నారని ఆయా గ్రామాల ప్రజలు నంద్యాలలోని ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ మేరకు విచారణ చేసినట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన వివరాలను అధికారులకు నివేదించిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

● గతంలో మండలంలో మినీ గోకులం షెడ్లను నిర్మిస్తున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించలేదన్న ఆరోపణలపై ఏపీడీ అన్వరాభేగం విచారణ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గోకులం షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. లబ్ధిదారులు మినీ గోకులం షెడ్లు నిర్మించుకున్న తమకు బిల్లులు చెల్లించడంలేదని నంద్యాల స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించామని చెప్పారు. వీరు ఇచ్చిన ఫిర్యాదులో పశువైద్యశాలల నుంచి కూడా మినీ గోకులం షెడ్లకు సంబంధించి వెటర్నరీ శాఖ నుంచి కూడా కొంత నగదు రావాల్సి ఉన్నట్లు గుర్తించామన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. నంద్యాల కార్యాలయ ఏపీవో కాశీం సాహెబ్, ఈసీ శ్రీనివాసులు, ఐటీడీఏ ఏపీవో రాజు నాయక్, సిబ్బంది ఉన్నారు.

'బాల్య వివాహం చేస్తే చర్యలు'

మిడుతూరు, సెప్టెంబరు 10: బాల్యవివాహం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీడీపీవో కోటేశ్వరమ్మ హెచ్చరించారు. మండలంలోని అలగనూరు, రోళ్లపాడు, తలముడిపి గ్రామాల్లో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీడీపీవో మాట్లాడుతూ గ్రామాలల్లో బాల్యవివాహాల నిషేధ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరాల లోపు అబ్బాయిలకు వివాహాలు చేస్తే అందుకు సహకరించిన వారికి రెండేళ్ల జైలు శిక్ష లక్ష రూపాయల జరిమాన విధించడం జరుగుతుందని అన్నారు. బాల్య వివాహాల నిషేద కమిటీలు గ్రామంలో 15 రోజులకు ఒక సారి 11మంది కమిటీ సభ్యులతో సమావేశం జరిపి గ్రామంలో బాల్య విహాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. రికార్డులను పరిశీలించారు.

'సమస్యలు పరిష్కరించాలి'

మిడుతూరు, సెప్టెంబరు 10: మండలంలోని తలముడిపి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా నాయకుడు భాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండు చేశారు. మంగళవారం తలముడిపి గ్రామంలో రైతు సంఘం శాఖ మూడో మహా సభ వెంకట రాముడు అధ్యక్షతన నిర్వహించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ తలముడిపిలో డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులు, అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలాలు, ప్రజలకు ఇళ్ల స్థలాలు వీటితో పాటు సమస్యలు అధికంగా ఉన్నాయని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి షాలిబాషాకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం గ్రామంలో రైతు సంఘం శాఖ కార్యదర్శిగా మద్దిలేటిని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు వెంకటరాముడు, వెంకట శివరాముడు, వెంకటేశ్వర్లు, రఘుస్వామి, రాముడు, స్వామి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పౌష్టికాహారం తీసుకోవాలి

● సబ్‌కోర్టు న్యాయాధికారి తంగమణి

డోన్(రూరల్), సెప్టెంబరు 10: మహిళలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సబ్‌కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ సమావేశ భవనంలో సీడీపీవో శంషాబాద్ భేగం అధ్యక్షతన పౌష్టికాహార మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తంగమణి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్లే మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. పోషక విలువలు కలిగిన ఆకుకూరలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

డోన్(రూరల్), సెప్టెంబరు 10: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళా కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద రెడ్డి ఫస్ట్ స్టెప్ ఆర్గనైజర్ చైర్మన్ రాజశేఖర్ అభ్యర్థులకు సలహాలు, సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళా కార్యక్రమంలో ఐదు కంపెనీలు పాల్గొన్నాయి. 215 మంది అభ్యర్థులు హాజరు కాగా, 86 మంది అభ్యర్థులు అర్హతను సాధించారు.

కోతుల దాడి.. ఐదుగురికి గాయాలు

చాగలమర్రి, సెప్టెంబరు 10: మండలంలోని డి.వనిపెంట గ్రామంలో మంగళవారం కోతుల దాడిలో ఐదుగురు గాయపడ్డారు. కోతులు అధికంగా ఉండటంతో పిల్లలు, పెద్దలు, మహిళలు భయాందోళన చెందుతున్నారు. కోతులు వెంటబడి దాడి చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధితులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆమె మంగళవారం విజయవాడ 47వ డివిజన్‌లో పర్యటించారు. వరద బాధితులకు 25 కిలోల బియ్యం, వాటర్ బాటిళ్లను అందించారు. దాతలు వివిధ రకాలుగా సాయం చేస్తుండడంతో వారికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు చెప్పారు.



వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

15లోపు పంట నమోదు చేసుకోండి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 10 : రైతులు సాగు చేసిన పంటలకు పంట నమోదును 15లోపు చేసుకోవాలని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ రైతులు ఇంతవరకు పంటనమోదు చేసుకోని వారికి ప్రభుత్వం 15 వరకు అవకాశం కల్పించిందన్నారు.

మేధో సంపత్తి పెంచుకోవాలి

డోన్, సెప్టెంబరు 10: విద్యార్థులు మేధో సంపత్తిని పెంచుకోవాలని డోన్ నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల్లో భాగంగా వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కోట్ల రాఘవేంద్రరెడ్డి మెమెంటోలతో పాటు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, భాస్కర్ నాయుడు, ఓంప్రకాష్, కేడీసీసీ డైరెక్టర్ సీమ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవులు వన్యప్రాణుల సంరక్షణలో నిర్లక్ష్యం తగదు

రుద్రవరం, సెప్టెంబరు 10 : అడవులు వన్యప్రాణుల సంరక్షణలో నిర్లక్ష్యం తగదని ఫీల్డ్ డైరెక్టరు టైగర్ ప్రాజెక్టు అధికారి బీఎస్ఎస్ మూర్తి అన్నారు. మంగళవారం సాయంత్రం నల్లమల అటవిలో భాగంగా రుద్రవరం రేంజ్‌లో తనిఖీ చేశారు. బోరింగ్‌బేస్ క్యాంపు తనిఖీ చేసి వాకీటాకీలు, వైర్‌లెస్ సెట్ పనిచేస్తుందా లేదా అని ప్రొటెక్షన్ వాచర్లను అడిగి తెలుసుకున్నారు. అడవులు, వన్యప్రాణుల సందర్శనల ఎప్పటికప్పుడు అప్రమత్తగా ఉండాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డైరెక్టరు అనురాగ్ మీనా, ఫారెస్టు రేంజ్ ఆఫీసరు శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు ముక్తర్‌బాషా ఉన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

రుద్రవరం, సెప్టెంబరు 10: రుద్రవరంలో ఆత్మహత్యకు యత్నించిన పర్వీన్ (27) అనే యువతి మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సమస్యల కారణంగా పర్వీన్ సోమవారం పంటలకు వినియోగించే మందు తాగాంది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. తండ్రి మాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాలన్న తెలిపారు.

వేలం పాటలు

బనగానపల్లె , సెప్టెంబరు 10: నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో వేలం పాటలు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించినట్లు ఆలయ ఈవో కామేశ్వరమ్మ మంగళవారం తెలిపారు. టెంకాయలు, కిరాణం, క్యాంటీన్, కూల్ డ్రింక్స్ వేలం పాటలు నిర్వహించారు. టెంకాయల వేలంలో వెల్లుర్తి వాసి చింతకుంట రామాంజనేయులు 31.30 లక్షలకు వేలం పాట పాడి దక్కించుకోగా, కిరాణా దుకాణం వేలం పాటలో పరమేశ్ 2.20 లక్షలకు, హోటల్ వేలంలో గుద్దేటి ప్రసన్న లక్ష్మి 2.75లక్షలు వేలం పాట పాడి దక్కించుకున్నారు.

యువకుడు ఆత్మహత్య

చాగలమర్రి, సెప్టెంబరు 10: చాగలమర్రి గ్రామంలోని ఓ డాబాలో జ్ఞానాపురం గ్రామానికి చెందిన యువకుడు ఎ. నిర్మల్‌బాబు (24)ఉరి వేసుకొని మంగళవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడాడు.. మృతుడు గత కొన్ని నెలలుగా డాబాలో పని చేసేవాడు. ఆర్థిక కారణాల వల్ల జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకున్నాడని ఏఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జీవో 85ను రద్దు చేయాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 10 : ప్రభుత్వ పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులకు పీజీ కోటాలో అన్యాయం జరిగేలా ఉన్న జీవో85ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కొలిమిగుండ్ల పీహెచ్‌సీ వైద్యుడు డా.హరిచరణ రెడ్డి, డాక్టర్ నాగజ్యోతి పేర్కొన్నారు. మంగళవారం ఆసుపత్రిలో డాక్టర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ విధులు నిర్వహించారు. గతంలో ప్రభుత్వ ట్రైబల్, రూరల్, అర్బన్ ఆసుపత్రుల్లో విధులు నిర్వహించే వైద్యులకు పీజీ కోటాలో 30శాతం రిజర్వేషన్ ఉండేదని, దాన్ని జీవో-85 విడుదల చేసి 15శాతానికి తగ్గించారని, దీంతో వైద్యులు తీవ్రంగా నష్టపోతారన్నారు.

రుద్రవరం: జీవో 85ను రద్దు చేయాలని వైద్యురాలు గాయత్రి డిమాండ్ చేశారు. మంగళవారం ఎర్రగుంట్ల వైద్యులు షబీర్, భవ్య, ఆలమూరు అమర్‌నాథరెడ్డి, నరసాపురం బాబు, అహోబిళం శివమోహన్, నాగమస్తాన్ నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు.

మినుము పంట పరిశీలన

అవుకు, సెప్టెంబరు 10 : మండలంలోని మారేమడుగుల గ్రామంలో రైతులు సాగు చేసిన మినుము పంటను పరిశీలించినట్లు వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ మంగళవారం తెలిపారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో కొండమనాయునిపల్లె, మారేమడుగుల గ్రామాల పరిధిలోని రైతులు 482 ఎకరాల్లో మినుము పంటను సాగు చేశారన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎకరాకు 5 - 6 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. రైతుసేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో తిరిగి పంట నమోదు చేస్తున్నారన్నారు. ఇంకా మిగిలిన రైతులు ఈనెల 15వతేదీ లోపు పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు శారద, గ్రామ రైతులు నారాయణరెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్

● యర్రగుంట్లలో కనుమరుగైన జగనన్న కాలనీలు

● ప్లాట్ల రాళ్లను తొలగించి యధేచ్ఛగా వ్యవసాయ పనులు

● చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

శిరివెళ్ల, సెప్టెంబరు 10

పేద ప్రజల కోసం గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు కనుమరుగయ్యాయి. ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లోని ప్లాట్ల రాళ్లను కొందరు వ్యక్తులు యథేచ్ఛగా తొలగించి వ్యవసాయ పనులు చేపట్టారు. పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు ఏర్పాటు చేసిన కాలనీకి చెందిన ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నా.. సంబంధిత రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

లేఅవుట్‌లో వ్యవసాయ పనులు

శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు గత ప్రభుత్వంలో ఐదు జగనన్న కాలనీలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి పక్కన, గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 81-1ఏలో 1.88 ఎకరాల్లో కాలనీని సిద్ధం చేశారు. లేఅవుట్‌లో ప్లాట్లను ఏర్పాటు చేసి యర్రగుంట్లకు చెందిన 51 మంది లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు 2023లో పట్టాలు సైతం అందజేశారు. ఈ లేఅవుట్ పంట పొలాల మధ్యలో ఉండడం, ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు జరగకపోవడంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్లాట్ల రాళ్లను తొలగించి వ్యవసాయ పనులు చేపట్టి నారుమడి వేసేందుకు సిద్ధమయ్యాడు. దీంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లేఅవుట్‌లో వరి పైరు సాగు :

మండలంలోని యర్రగుంట్ల గ్రామ ప్రజల కోసం వెంకటేశ్వరాపురం గ్రామానికి వెళ్లే రహదారిలోని ప్రభుత్వ భూమిలో అధికారులు జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమికి చెందిన సర్వే నంబర్ 30-బీ, 43-బీలో మొత్తం 1.50 ఎకరాల్లో ప్లాట్లను సిద్ధం చేసి 67 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. యర్రగుంట్లకు చెందిన ఓ వ్యక్తి ఈ కాలనీలోని ప్లాట్ల రాళ్లను అక్రమంగా తొలగించి ఏకంగా వరి పైరును సాగు చేశాడు. రెవెన్యూ సిబ్బంది ఆదివారం ఉదయం లేఅవుట్‌కు వెళ్లి వరి పైరును తొలగించారు. యర్రగుంట్ల గ్రామ పరిధిలో ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.




వెంకటేశ్వరాపురం సమీపంలోని లేఅవుట్‌లో చేపట్టిన వ్యవసాయ పనులు

విచారించి చర్యలు తీసుకుంటాం



యర్రగుంట్ల గ్రామంలోని జగనన్న కాలనీలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. వెంకటేశ్వరాపురం రహదారిలోని లేఅవుట్‌లో వేసిన వరి పైరును సిబ్బంది సహకారంతో తొలగించాం. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- పుష్ప కుమారి, తహసీల్దార్, శిరివెళ్ల



యర్రగుంట్ల కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో వేసిన వరి నాట్లు

గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

బనగానపల్లె, సెప్టెంబరు 10: బనగానపల్లె పట్టణంలో బుధవారం నిర్వహించనున్న గణేశ్ నిమజ్జన ఏర్పాట్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల గణేశ్ ఉత్సవ కమిటీ గౌరవసలహాదారు టంగుటూరు శ్రీనయ్య, అధ్యక్షుడు మల్లారెడ్డి మంగళవారం తెలిపారు. గణేశ్ నిమజ్జనానికి సంబంధించి కైప చెరువు వద్ద నిర్వహించే ఏర్పాట్లను వారు పరిశీలించారు. కైప చెర్వులో బనగానపల్లె పట్టణానికి సంబంధించిన సుమారు 150కిపైగా విగ్రహాలు బుధవారం నిమజ్జనం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వంకదారశేషప్రసాద్, టీచర్ మనోహర్, బల రాం పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు హుసేన్ రెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, మారుతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కైప చెర్వు వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న టంగుటూరు శ్రీనయ్య, మల్లారెడ్డి

బనగానపల్లె : మండలంలోని పలుకూరు గ్రామంలో మంగళవారం గణేశ్ నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఊరేగించి సమీప ఎస్సార్బీసీ కాల్వలో నిమజ్జనం చేశారు.

వినాయక నిమజ్జనం

బేతంచెర్ల, సెప్టెంబరు 10: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణంలో 41 గణేష్ ఉత్సవ కమిటీ మండలి కేంద్రాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసి నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం కర్నూలు రహదారిలోని వినాయక ఘాట్‌లో ప్రశాంతంగా నిమజ్జన వేడుకలను నిర్వహించారు. అనంతరం కర్నూలు రహదారిలోని వినాయక ఘాట్‌లో గణనాథులను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయ నాయక్, బేతంచెర్ల సీఐ వెంకటేశ్వర్లు,



నిమజ్జనానికి వెళ్తున్న విగ్రహాలు

నష్టపోయాం ఆదుకోండి



మల్లారెడ్డి కుంట గండితో దెబ్బతిన్న పంటలు

చాగలమర్రి, సెప్టెంబరు 10: మండలంలోని చిన్నవంగలి గ్రామ సమీపంలో మల్లారెడ్డి కుంటకు గండిపడి పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరద నీరు సాగు చేసిన పంట పొలాల్లో ప్రవహించడంతో పంటలు దెబ్బతిని నష్టం వాటిల్లిందని అన్నారు. మొక్కజొన్న, పసుపు, వరి పంటలు నీట మునగడంతో పెట్టిన పెట్టుబడి నీళ్లపాలైందని అన్నారు. వ్యవసాయశాఖ స్పందించి నీట మునిగిన పంటలకు నష్టపరిహారం కోసం అంచన వేసి పరిహారం అందేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వరద బాధితులకు నిత్యావసర కిట్లు

డోన్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు డోన్ నుంచి 1200 నిత్యావసరాల కిట్లను తరలించారు. మంగళవారం పట్టణంలోని తన నివాసం వద్ద నిత్యావసర కిట్లను తీసుకెళ్తున్న ప్రత్యేక వాహనాన్ని టీడీపీ యువ నాయకుతిడు కోట్ల రాఘవేంద్రరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే కోట్ల ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, తిమ్మయ్య యాదవ్, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, దేవరబండ వెంకటనారాయణ, రామదుర్గం జయరాముడు, మిద్దెపల్లి గోవిందు తదితరులు విజయవాడ వరద బాధితులకు నగదు విరాళాలతో పాటు నిత్యావసర సరుకులను సేకరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, లక్ష్మినారాయణ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విజయవాడకు నిత్యావసర సరుకుల తరలిస్తున్న వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి: విజయవాడ వరద బాధితుల సహార్థం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్, సీనియర్ టీడీపీ నాయకులు వై లక్ష్మినారాయణయాదవ్‌లు 200 కిట్లు విరాళంగా ఇచ్చారు. ఈ కిట్లను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం సహాయనిధికి పంపడం జరుగుతుందని నేతలు మంగళవారం ప్యాపిలిలో తెలిపారు. ఒక్కోకిట్టులో రూ.600 విలువ చేసే వస్తువులు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

రుద్రవరం: విజయవాడ వరద బాధితులకు రుద్రవరం గ్రామానికి చెందిన యువకులు మంగళవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. 110 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి తమ మానవత్వం చాటుకున్నారు.

అతిసార నివారణకు చర్యలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 10: ఆళ్లగడ్డలోని చాంద్ వీధిలో అతిసార వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యుడు నరసింహులు తెలిపారు. ఇమాంబి(70) అనే వృద్ధురాలు అతిసారాతో మృతి చెందడంతో మంగళవారం కాలనీలో పర్యటించారు. ప్రజలు కలుషిత నీరు తాగడం వల్ల వ్యాధి సోకిందని, నీటిని కాచి వడపోసుకొని తాగాలని వైద్యుడు సూచించారు.

చిన్నవంగలి గణేశ్ లడ్డూ రూ.1.25 లక్షలు

చాగలమర్రి, సెప్టెంబరు 10: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో వినాయక విగ్రహం వద్ద మంగళవారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన శీలం పెద్ద వెంకట్‌రెడ్డి రూ.1.25 లక్షలతో వేలం పాట పాడారు. వేర్వేరు చోట్ల కొలువుదీన నాలుగు విగ్రహాల వద్ద లక్కిరెడ్డి నరేంద్రారెడ్డి రూ.55 వేలు, కేతులసీశ్వర్‌రెడ్డి రూ.54 వేలు, కేశవరెడ్డి రూ.60 వేలు వేలం పాటలు పాడారు. విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపుగా వెళ్లి కుందూనదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నర్సిరెడ్డి, గురుశేఖర్‌రెడ్డి, సంజీవ రెడ్డి, గురునాథ్ రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



లడ్డూను దక్కించుకున్న శీలం వెంకట్‌రెడ్డి

నేడు నిమజ్జనం

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 10: ఆళ్లగడ్డలో బుధవారం గణేష్ నిమజ్జనం నిర్వహించనున్నట్లు గణేష్ ఉత్సవ కమిటీ మంగళవారం తెలిపారు. నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు గణేశ్ విగ్రహాల నిర్వాహకులు సహకరించాలని కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి

చాగలమర్రి, సెప్టెంబరు 10: గ్రామాల్లో పంట నమోదు చేయించుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని మండల ఏవో రంగనేతాజీ తెలిపారు. మంగళవారం గొడిగనూరు గ్రామంలోని ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బంది చేస్తున్న ఈకేవైసీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, వీఏఏ ప్రసన్నకుమార్ రెడ్డి, రైతులు ఉన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌గా సాగు చేసిన పంటలను 5300ఎకరాల్లో పంట నమోదు పూర్తి చేశామని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి మంగళవారం తెలిపారు. ఇంకా 114ఎకరాల్లో సాగు చేసిన పంటలు పంట నమోదు చేయాల్సివుందని అన్నారు. పంట నమోదు చేసుకోకపోతే ప్రభుత్వం అందించే పథకాలు అందని చెప్పారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

చాగలమర్రి: రైతులు పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ ఏడీ వరప్రసాదు తెలిపారు. మంగళవారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలని అన్నారు. గాలికుంటు వ్యాధి నివారణకు ఎద్దులు, గేదెలకు టీకాలు తప్పనిసరిగా రైతులు వేయించుకోవాలని అన్నారు. మినీ గోకులాల కోసం దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు.

రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు

బేతంచెర్ల, సెప్టెంబరు 10: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన ప్రజలు రైల్వే ట్రాక్ దాటి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే ఫుట్ ఫ్లైఓవర్ బ్రిడ్జి మంజూరైందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు వల్ల ప్రజల కష్టాలు తీరున్నానయని అన్నారు. కార్యక్రమంలో ముర్తుజావలి, మద్దిలేటి స్వామి ఆలయ మాజీ చైర్మన్ సీహెచ్ లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకోం : ఏఐటీయూసీ

డోన్(రూరల్), సెప్టెంబరు 10: విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే కేంద్ర ప్రభుత్వానికి పతనం తప్పదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య హెచ్చరించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని పాతబస్టాండులో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ అనుబంధ సంఘాల నాయకులు నారాయణ, అబ్బాస్, అన్వర్, షమీమ్ బేగం పాల్గొన్నారు.



దోన్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

● విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బేతంచెర్ల సర్కిల్ రోడ్డులో కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం మాట్లాడుతూ విశాఖ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పనుతుందని ఆరోపించారు.

కొలిమిగుండ్ల: విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా ప్రైవేటీకరణ చేయడం తగదని సీపీఐ నాయకులు సూర్యనారాయణ అన్నారు. మంగళవారం విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయరాదంటూ కొలిమిగుండ్లలో ధర్నా నిర్వహించారు. ఆటో యూనియన్ కార్మికులతో కలిసి బస్టాండు వద్ద ప్రధన రహదారిలో బైఠాయించారు. కార్యక్రమంలో కంబగిరి, రంగ, రాజు, ఓబులేషు, నారాయణ పాల్గొన్నారు.

బేతంచెర్ల: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు యేసురత్నం డిమాండ్ చేశారు. మంగళశారం పట్టణంలోని పాతబస్టాండు సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో జూలకంటి శ్రీనివాసులు, రామకృష్ణ, కుల్లాయప్ప, వెంకట్రాముడు, మాలిక్‌బాషా, ఆంధ్ర భోజనం మద్దిలేటి, రాజబాబు, ఎస్కేబాషా, రామళ్లకోట బాషా, హరికృష్ణ, సాంబార్ మధు, ధనుంజయుడు పాల్గొన్నారు.



వర్షం లేక పండు బారిన మినుము పంట

కరుణించని వరుణుడు ..

● కొలిమిగుండ్లలో కనీస వర్షపాతం కరువైన దుస్థితి

● వెల వెలబోతున్న చెరువులు, కుంటలు

● అడుగంటుతున్న భూగర్భ జలాలు ● ఆందోళనలో రైతులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 10 : ఓవైపు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలతో జనం అల్లాడుతుంటే కొలిమిగుండ్ల మండలంలో కనీస వర్షపాతం కురువైన పరిస్థితి నెలకొంది. దీంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రధాన చెరువులతో పాటు, కుంటలు, వాగులు, వంకలు నీరు లేక వెలవెలబోతున్నాయి. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతన్నలకు సంబంధించిన బోరు బావుల్లో సైతం నీరు అడుగంటుతుండడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మండలంలో ఖరీఫ సాధారణ సాగు 6500ఎకరాలు కాగా, ఇప్పటికే 5500ఎకరాల్లో రైతన్నలు పంటలు సాగు చేశారు. ఇప్పటికి వరకు 1మి.మీ వర్షపాతం కూడా నమోదు కాలేదు. మండలంలో అత్యధికంగా 1500ఎకరాల్లో రైతులు కంది పంటను సాగు చేయగా, మొక్క జొన్న, మినుము, ఆముదం, పత్తి తదితర పంటలను సైతం సాగు చేశారు. మండలంలోని చింతలాయపల్లె, మదనంతపురం, తిమ్మనాయినిపేట, ఇటిక్యాల తదితర గ్రామాల్లో సాగు చేసిన పంటలు తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే పండు బారి వాడిపోయో పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. మరో పది రోజుల్లో వర్షాలు కురవక పోతే అనేక గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.